# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 30-06-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- త్వరలో జరగనున్న ఒలింపిక్స్ లో భారత క్రీడాకారులు పతకాలు తీసుకురావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మన్ కీ బాత్ కార్యక్రమంలో ఆకాంక్షించారు.

- గిరిజనుల సహకారంతోనే అరకు కాఫీ ప్రపంచ ప్రసిద్ధి చెందిందని ప్రధాని నరేంద్ర మోడీ పేర్కొన్నారు

- రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పేరిట సామాజిక పెన్షన్లను రేపు ఉదయం నుంచి లబ్ధి దారులకు అందిస్తుందని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.

- కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకు వచ్చిన మూడు నేర న్యాయ చట్టాలు రేపటి నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి రానున్నాయి.

- ఉపరితల అవర్తనము ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాలలో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

==============================

క్రీడాకారులు పతకాలు తీసుకురావాలని యావత్ భారత దేశం ఎదురు చూస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మూడవ సారి ప్రధానమంత్రి అయిన తరువాత తొలిసారిగా ఆయన ఆకాశవాణి ద్వారా ప్రజలను ఉద్దేశించి ఈ రోజు మన్ కీ బాత్ 111 వ సంచికలో మాట్లాడుతూ పారిస్ ఒలింపిక్స్ వచ్చే నెలలోనే ఇదే సమయానికి ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఒలింపిక్ క్రీడలకు హాజరయ్యే భారత బృందానికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. టోక్యో ఒలింపిక్స్ లో భారత క్రీడాకారుల ప్రదర్శన ప్రతి భారతీయుడి హృదయాలను గెలుచుకుందని ఆయన గుర్తు చేశారు. పారిస్ ఒలంపిక్స్ లో సైతం రాణించాలని ప్రధాని ఆకాంక్షిస్తూ....

(వాయిస్ 45 సెకన్లు)

ఇదిలా ఉండగా, 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని యావత్ ప్రపంచం ఉత్సాహంగా జరుపుకుందని ప్రధాన మంత్రి అన్నారు. అల్ హనూఫ్ సాద్ అనే మహిళ సౌదీ అరేబియాలో మొట్టమొదటిసారిగా కామన్ యోగా ప్రోటోకాల్ కు నాయకత్వం వహించిందని ప్రధాన మంత్రి గుర్తు చేశారు. ఈజిప్టులో యోగా దినోత్సవం సందర్భంగా ఫోటో కాంపిటీషన్ నిర్వహించారని ప్రధాన మంత్రి అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గత దశాబ్ద కాలంలో దేశంలో అటవీ విస్తీర్ణం బాగా విస్తరించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలిపారు. ఈ రోజు ఆకాశవాణీ ద్వారా మన్ కీ బాత్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, అమృత్ మహోత్సవ్ సందర్భంగా దేశవ్యాప్తంగా 60 వేలకు పైగా అమృత్ సరోవర్లను రూపొందించినట్లుగా పేర్కొన్నారు. కాగా, ఆంధ్రప్రదేశ్ లోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో పెద్ద ఎత్తున ఉత్పత్తి అవుతున్న అరకు కాఫీ గురించి కూడా ప్రధాన మంత్రి మాట్లాడారు. సుమారు లక్ష 50 వేల గిరిజన కుటుంబాలు అరకు కాఫీ సాగుతో ముడిపడి ఉన్నాయన్నారు. అరకు కాఫీని మరింత ప్రాచుర్యంలోకి తీసుకెళ్లడంలో గిరిజనుల సహకారం కీలక పాత్ర పోషించిందని నరేంద్రమోదీ పేర్కొంటూ...

(వాయిస్ 46 సెకన్లు)

కాగా, ఆకాశవాణి సంస్కృత బులెటిన్ నేటితో 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆకాశవాణి కుటుంబాన్ని ప్రధానమంత్రి అభినందించారు. మరో వారం రోజుల్లో పూరీలో రథయాత్ర ప్రారంభం కానుందని, జగన్నాథుడి ఆశీస్సులు దేశ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. అదే విధంగా అమర్ నాథ్ యాత్ర, పండరీపూర్ వారి గురించి ప్రస్తావించి ఈ యాత్రల్లో పాల్గొనే భక్తులందరికీ శుభాకాంక్షలు తెలియజేసారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్ర ప్రభుత్వం పెంచిన మొత్తంతో కలుపుకుని జూలై ఒకటవ తేదీన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ లబ్ధిదారులకు సామాజిక పెన్షన్లు అందచేస్తోందని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని నిడదవోలు పట్టణంలో ఈ రోజు పాత్రికేయులతో మంత్రి మాట్లాడుతూ, అన్ని రకాల పెన్షన్లు జులై 1వ తేదీనే నూరు శాతం అందించే విధంగా చర్యలు చేపట్టామన్నారు. కాగా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్టీఆర్ జిల్లాలో పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు గ్రామంలో పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని మంత్రి వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన మూడు నేర న్యాయ చట్టాలు రేపటి నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి రానున్నాయి. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత భారతీయ సాక్ష్య అధినియం అనే నేర న్యాయ చట్టాల్ని అమలు చేయడానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తీసుకు వచ్చినట్లుగా కేంద్ర ప్రభుత్వ అధికార వర్గాలు తెలిపాయి. కాగా, గత ఏడాది శీతాకాల సమావేశాల్లో ఈ మూడు బిల్లుల్ని పార్లమెంటు ఆమోదించింది. ఈ చట్టాల అమలు ద్వారా సమర్ధవంతమైన సత్వరమైన న్యాయ వ్యవస్థను ప్రజలకు అందించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. కాగా, కొత్త నేర చట్టాల్లో ఆన్ లైన్ లోనే ఫిర్యాదులు చేయడంతో పాటు తమకు దగ్గరలోని ఏదైనా పోలీస్ స్టేషన్లో ఎఫ్ఐఆర్ దాఖలు చేయడం, ఎఫ్ఐఆర్ యొక్క ఉచిత కాపీని పొందడం వంటి సంస్కరణలను తీసుకుని వచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత దేశ నూతన ఆర్మీ చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఈ రోజు పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆర్మీ చీఫ్‌గా పదవీ విరమణ చేసిన జనరల్ మనోజ్ పాండే స్థానంలో ద్వివేదీ నియమితులయ్యారు. ద్వివేది 1984లో జమ్ము కాశ్మీర్ రైఫిల్స్‌లో చేరడం ద్వారా సైన్యంలో తన సేవలను ప్రారంభించారు. నార్తర్న్ ఆర్మీ కమాండర్‌గా ఆయన సుదీర్ఘ కాలం పాటు పనిచేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విశాఖలోని ఏసీఏ–వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఆంధ్ర ప్రీమియర్ లీగ్ 3వ సీజన్ ను రాష్ట్ర క్రీడల శాఖమంత్రి యం.రాంప్రసాద్‌రెడ్డి కొద్ది సేపటి క్రితం ప్రారంభించారు. తొలి మ్యాచ్ లో రాయలసీమ కింగ్స్ , కోస్టల్ రైడర్స్ జట్లు పోటీ పడనున్నాయి. మొత్తం ఆరు జట్లు 19 మ్యాచ్ లలో పోటీపడగా జూలై 13వ తేదీ వరకు మ్యాచ్‌లు జరగనున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నకిలీ విత్తనాలు తయారు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. దీని కోసం కేంద్రంతో సంప్రదించి చట్టాలు మార్చేలా కృషి చేస్తామని తెలిపారు. గుంటూరులో వ్యవసాయ సంబంధిత రంగాల అధికారులతో ఈ రోజు కేంద్ర మంత్రి సమీక్ష నిర్వహించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్రంలోని రైతులు వరి, మినప, పత్తి వంటి పంటలతో పాటు పామాయిల్ వంటి పంటలు కూడా వేసేలా ప్రోత్సహిస్తున్నమని తెలిపారు. కేంద్రం పామాయిల్ వంటి పంటలకు అనేక రాయితీలు అందిస్తోందని, వీటిని రాష్ట్రంలోని రైతులు ఉపయోగించుకోవాలని కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పోలవరం ప్రాజెక్టును అంతర్జాతీయ నిపుణుల బృందం ఈ రోజు పరిశీలించింది. అమెరికా, కెనడా నుంచి వచ్చిన నలుగురు నిపుణుల బృందం ప్రాజెక్టు వద్దకు చేరుకుని అక్కడి పరిసరాలను పరిశీలించి అధికారులతో మాట్లాడింది. కాఫర్ డ్యాంతో పాటు ఇతర పనుల తీరును నిపుణులు పరిశీలించారు. అలాగే, పోలవరం ప్రాజెక్టు స్పిల్ వే చేరుకుని ప్రాజెక్టు వ్యూ పాయింట్‌పై నుండి ప్రాజెక్టు పరిశీలించారు. ఇంజనీరింగ్ అధికారులు చి సంబంధిత వివరాలు విదేశీ నిపుణుల బృందానికి తెలియజేసారు. కాగా ఈ రోజు నుంచి నాలుగు రోజుల పాటు అంతర్జాతీయ నిపుణుల బృందం పోలవరం ప్రాజెక్టును పరిశీలించనుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వాయువ్య బంగాళాఖాతంలో ఉత్తర ఒడిశా పశ్చిమ బెంగాల్ తీరాలకు ఆనుకుని ఏర్పడిన ఉపరితల అవర్తనము ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాలలో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. అదే విధంగా భారీ వర్షాలు ఒకటి లేక రెండు చోట్ల కురిసే అవకాశము ఉందని, ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముందని హెచ్చరించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =